
ఎన్.వి.ఎస్. నాగభూషణాచార్యులు



# అందినా, అందుకోని ద్రాక్ష

ఇంకా ఇంటర్వ్యూకి టైం వుండటంవల్ల నెమ్మదిగా నడుస్తున్నాను. నాలాగా చాలామంది ఉద్యోగార్థులు ఫైళ్లు, బాగ్‌లు, సూట్‌కేసులు పుచ్చుకుని ఒంటరిగానో, తల్లిదండ్రులు అన్నలు అక్కలు మొదలైన వారి వెంటో ఆర్చిలోనుండి లోపలికి వస్తున్నారు. జిల్లా పరిషత్ ఆఫీసులో ఎవరికివారు అక్కడక్కడా కూర్చునో నిలబడో కాలం గడుపుతున్నారు.

ప్రకటించిన ఖాళీలు నాలుగే. ఈ జనాన్నిబట్టి చూస్తే వందలాదిమంది వున్నట్లున్నారు. జేబులోంచి మరోసారి ఇంటర్వ్యూ కార్డు తీసి నెంబరు చూశాను. 398...

అయితే కనీసం అభ్యర్థులు నాలుగొందలకు తక్కువుండరు. నాలుగు పోస్టులకోసం నాలుగొందల మంది రావడం ఈ దేశంలో వింతేం కాదులెమ్మని సరిపెట్టుకొన్నాను. అయినా భాషా ప్రవీణ చదివి, తెలుగు పండిట్ ఉద్యోగానికి తప్ప వేరే ఉద్యోగాలకు పనికిరాని మాలాటి వాళ్ళకు తక్కువ సంఖ్యేనని చెప్పక తప్పదు!

ఏళ్ల తరబడి నిరుద్యోగుల జాబితాలో స్థిర నివాసం ఏర్పర్చుకోవడం, ప్రతి జిల్లా పరిషత్తు ప్రకటనకూ అప్లికేషన్ పెట్టుకుని, అదెంత దూరమున్నా హాజరవడమూ- ఇది మా వాళ్లకి కొత్తేంకాదుగదా! బతకలేక బడిపంతులనే సామెత ఊరికే రాలేదని నిరుద్యోగ తెలుగు పండితుల్ని చూస్తే ఎవరికైనా అర్థమైపోతుంది.

భుజం మీద గట్టిగా ఎవరిదో చెయ్యిపడటంతో నా ఆలోచనలకు బ్రేక్ పడింది. తల తిప్పి చూశాను.

''ఎవరూ... శాస్త్రి కాదూ?'' ఇంకా అనుమానంగానే.

''ఉత్తశాస్త్రికాదు... వీర వెంకట హనుమాన్ వర...''

''బాబ్బాబు... ఆపాపు. నువ్వెన్నిసార్లు నీ పేర్ల దండకం చదివినా నాకు గుర్తుండి చావదు గానీ, విశేషాలేమిటో చెప్పు!'' విసుగు కనబడనీయకుండా.

''ఏమున్నాయి... మామూలే! నీలాగే నేనూ నిరుద్యోగినే కానీ, ఉద్యోగం ఉన్న నిరుద్యోగిని!''

''అంటే...?''

''ఏముంది... తద్దినాలూ, పెళ్లిళ్లూ, శ్రాద్ధాలూ, సత్యనారాయణ వ్రతాలూ... ఇవి చేయించడం మాత్రం ఉద్యోగం కాదంటావా? ఇవంటే నీకు గిట్టదు కానీ, ఉన్నమాట చెబుతాను... దేవుడున్నాడో లేడో మనం చూళ్లేదు కానీ, ఆ నమ్మకం మాత్రం మాబోటి వాళ్లకి జీవనోపాధి చూపిస్తోంది! అయినా ఈ ఉద్యోగాలుచేసి ఏం సంపాదిస్తావు నా పిండాకూడు! పౌరోహిత్యం చేసే వాళ్ల రాబడి ఈ మేష్టర్లకెక్కడిది?'' జ్ఞానోపదేశం చేసినట్లు చెప్పాడు శాస్త్రి.

వాడు చెప్పిందాన్ని పూర్తిగా ఒప్పుకోవడం ఇష్టంలేక, ''మరయితే ఈ ఇంటర్వ్యూకి నువ్వెందుకొచ్చినట్లో?'' వాడు చెప్పే జవాబు కొంత వూహించుకునే అడిగాను.

''ఎంత అమాయకుడివిరా! ఉద్యోగం పురుష లక్షణమన్నారు కదా! అది లేకపోతే ఈ రోజుల్లో మార్కెట్లో డిమాండేం ఏడ్చింది? అది సరే, నువ్విన్ని జిల్లాలు దాటి రావడం నిజంగా ఉద్యోగం వస్తుందన్న ఆశతోనేనా?'' అనుమానంగా అడిగాడు.

''నిరుద్యోగులు బతికేది ఆ ఆశతోనే కదా శాస్త్రీ! అదే లేకపోతే ఎన్ని లక్షల మంది తనువులు చాలించుకుంటారో! అయినా మా నాన్న వడ్రంగం పనిచేసి కష్టపడి సంపాదించే డబ్బుని కడుపునిండా తినకుండా ఇలా ఇంటర్వ్యూలకు ఖర్చుపెట్టించడం చాలా బాధగా వుంది. నాలుగుచోట్లకి నాలుగురాళ్లు విసిరితే ఏదో ఒకటయినా తగులుతుందన్న ఆశే ఇంత దూరం తీసుకువచ్చింది''.

''సారీరా... బాధపడకు! ఇలాంటి బాధలు ఎన్ని పడాలో! అందుకే ముందు జాగ్రత్తపడి మా నాన్న మార్గంలో నేను అడుగుపెట్టాను. అయితే ఒక్క విషయం. ఇక్కడ ఒట్టిరాయి విసిరితే లాభం లేదు, గట్టి రాయి విసరాలి!'' అన్నాడు శాస్త్రి సానుభూతి చూపిస్తూనే హెచ్చరికగా.

''అంటే?''

''ఓరి అమాయకపు చక్రవర్తీ... ఆ మాత్రం తెలియదా జిల్లా పరిషత్తుల చరిత్ర? ఒక్కో పోస్టుకి ఇంత చొప్పున పోస్టుల బేరం ఎప్పుడో సెటిలయిపోయింది!'' సిగరెట్టు వెలిగించాడు.

''నువ్వూ కూడా కొనుగోలుదారుల్లో ఉన్నావా?'' వాడు ఊదే పొగ రింగులకేసి చూస్తూ ప్రశ్నించాను.

నా ప్రశ్నకు వాడికి నవ్వు వచ్చింది. ''నేను కొనడమా? మా వంశమెలాంటిదనుకున్నావు... నిప్పులాంటిది! దేన్నయినా అప్పనంగా లాగించడమే తప్ప, కొనడమే?... ఎంతవమానం!''

''మరి...?'' అన్నాను సందేహంగా.

నా మాట పూర్తికాకుండానే అందుకున్నాడు శాస్త్రి. ''మొత్తం పత్రికల్లో ప్రకటించిన ఖాళీలు నాలుగు. ఆ నాలుగింటికీ బేరం సెటిలయిపోయింది. అయితే ఈ వేసవి సెలవులకు ముందు మరో పోస్టు ఖాళీ అయింది. అది మనకన్నమాట! మా వూరి ప్రెసిడెంటుకి ఆస్థాన విద్వాంసుడు, కాదుకాదు... ఆస్థాన పౌరోహిత్యుడు మా ఫాదర్. జిల్లా పరిషత్తు ఛైర్మన్‌కు కుడి భుజం మా వూరి ప్రెసిడెంటు!'' విషయాన్ని విశదీకరించాడు.

''వెరీ గుడ్! చదువులో పూర్‌గా వుండేవాడివి... లౌక్యంలో మాత్రం ఫస్ట్!'' అన్నాను నవ్వలేక నవ్వుతూ.

''మరేమిటనుకున్నావ్ ఈ వీర వెంకట హనుమాన్ వర...'' ఆగిపోయాడు శాస్త్రి నేను ఆపకుండానే. వాడి గొంతుతోపాటు నడక కూడా ఆగిపోయింది.

''ఏమిటి సంగతి?'' వాడెందుకాగిందీ అర్థంకాక, వాడు చూపించిన వైపు పరిశీలనగా చూశాను. మాకు ఇరవై గజాల దూరంలో ఇద్దరు అమ్మాయిలు నడుస్తున్నారు. వాళ్లుకూడా ఉద్యోగార్థులేననడానికి వాళ్ల చేతుల్లోని ఫైలు, పుస్తకాలే సాక్షి! వాళ్లిద్దరిలో ఒకమ్మాయిది వుంగరాల జుట్టు, పొట్టి జడ! మరో అమ్మాయిది పొడవాటి జడ. చివరలో మెలికలు తిరిగి తాచుపాములా నాట్యం చేస్తోంది ఆమె నడుస్తూంటే! మొదటి

అమ్మాయి మంచి పర్సనాలిటీ అయితే, రెండో అమ్మాయి సన్నగా నాజూగ్గా... పరస్పర విరుద్ధమైన వాళ్లు వాళ్లిద్దరూ! అయినా శాస్త్రిగాడి నోటి నుంచి మాటలు రానంత ఆశ్చర్యం నాకేమీ కనబడక, "విషయం ఏమిటో చెప్పరాదూ చంపక!" అన్నాను విసుగ్గా.

"కోప్పడకోయ్... కాస్త నిదానించి చూడు!" కళ్లెగరేస్తూ నవ్వాడు శాస్త్రి.

దాంతో ఆ విషయం ఏమిటో తెలుసుకోవాలనే కుతూహలంతో నా నడక వేగం పెంచాను. నాతోపాటు శాస్త్రీ...

"ఆధునిక పంచ కావ్యాలేమిటే?" బారుజడ ప్రశ్న.

"సౌందర్యందం, శివభారతం, ఇంకా... ... ..." తడుముకుంటోంది ఉంగరాల జుట్టు.

ఆ గొంతు... ఆ గొంతు... ఎక్కడో విన్నట్లు, బాగా సుపరిచితమైనట్లు అనిపించింది. అంతేనా? అంతకన్నా ఇంకా ఏదో దగ్గరయినట్లు... ... ... అవును, అది నాకిష్టమైన గొంతు... నన్ను కలల్లో విహరింపజేసిన గొంతు... సందేహం లేదు, ఈమె ఆమే! ఆమె పేరు... పేరు... అవును గుర్తొచ్చింది,... ఝాన్సీ! అవును ఈమె ఝాన్సీనే! ఆ పక్కనున్నది మరి ఉషారాణి కాక ఇంకెవరు?

ఎంతాశ్చర్యం! మళ్లీ చూస్తాననుకోలేదు! ఒకప్పటి కలల రాణి నా కళ్లెదుట ప్రత్యక్షమవుతుందనుకోలేదు. ఒక్కసారిగా ట్రైనింగ్‌నాటి స్మృతులు ముప్పిరిగొన్నాయి.

* * *

రాజమండ్రి పండిట్స్ ట్రైనింగ్ కాలేజీలో ఆ రోజుల్లో సీటు రావడమే గొప్ప. అలాంటిది మొదటి సీటు సంపాదించడం చెప్పుకోదగ్గ విశేషమే కదా! మొదటి సీటంటే రెండో దఫా ఇంటర్వ్యూలోనన్నమాట!

ఫస్టు సీటయితే వచ్చింది గాని, నేను జాయిన్ అయ్యే నాటికి ఆఖరి బెంచీలోనే సీటు దొరికింది. సెక్షన్ ఒకటే అయినా 100 మంది విద్యార్థులున్నారు. 15 మంది ఉంటేనే పెద్ద క్లాసుగా పరిగణింపబడే భాషాప్రవీణకూ- 100 మంది వున్న ట్రైనింగ్ క్లాసులో చివరి బెంచీలో కూర్చుని పాఠం వినడం, అందునా శివరామయ్య మాష్టారు చెప్పే రన్నింగ్ నోట్సు రాసుకోవడం చాలా ఇబ్బందిగా మారింది. సైకాలజీ లెక్చరర్ ఒక్కాయన మాత్రం నోట్సు డిక్టేట్ చేసేవారు. మెథడ్స్, అడ్మినిస్ట్రేషన్ రెంటికీ వచ్చే శివరామయ్యగారు ఇంగ్లీషు పుస్తకాల్ని తెలుగులోకి తర్జుమాచేస్తూ పాఠం గడగడా చెప్పేవారు.


శివరామయ్య మాష్టారికి ఖంగారెక్కువ. అందులోనూ పరమ కోపిష్టి. విద్యార్థులు అల్లరి చెయ్యకుండా కామ్‌గా వుండాలంటే గడగడా పాఠం చెప్పడమే మార్గమని ఆయన థియరీ! అయితే ఫలితం మాత్రం అందుకు సరిగ్గా వ్యతిరేకంగా జరిగేది. చాలామంది నోట్సు రాయడం ఎగ్గొట్టి కబుర్లు చెప్పుకునేవారు. ఇదంతా నాలాంటి నోట్సు రాసుకోవాలనుకునే వాళ్లకి ఇబ్బందిగా వుండేది. అందునా నాది లాస్ట్ బెంచీ అవడంవల్ల ఇక చెప్పే పనిలేదు.

అందుచేత మా బెంచీని తీసుకెళ్లి లేడీస్‌కి, జెంట్స్‌కి మధ్యనున్న 'నోమాన్ లాండ్'మీద వేసుకున్నాం. శివరామయ్య మాష్టారే క్లాస్ టీచర్ అవ్వడంవల్ల ఆయన మా ఇబ్బంది గ్రహించి చూసీచూడనట్లు వూరుకున్నారు.

మా బెంచీలో నా పక్కనే కూర్చునేవాడు సూర్యనారాయణ. నా బెంచీమేట్ మాత్రమేగాక హాస్టల్‌మేట్ కూడా! అందుచేత ఇద్దరం చాలా సన్నిహితంగా వుండే వాళ్లం.

సూర్యనారాయణ పెళ్లయినవాడు. ఇద్దరు పిల్లలు కూడా. ఇన్‌సర్వీస్ కాండిడేట్. అందువల్ల అతనితో ఆడపిల్లలు అరమరిక లేకుండా మాట్లాడేవాళ్లు. శృంగారాన్ని రంగరించి అతను చెప్పే మాటల్ని మగవాళ్లు అనేక మంది అతని చుట్టూ చేరి చెవికోసుకు వినేవాళ్లు!

మాముందు బెంచీ లేడీస్‌దని చెప్పాను కదా! ఆ బెంచీలో మాకు సరిగా ఎదురుగా ఉషారాణి, ఝాన్సీలు కూర్చునే వాళ్లు. ఉషారాణి పొడుగ్గా సన్నగా వెడల్పు మొహంతో ఉండేది. ఆమెను చూడగానే హిందీ సినిమా నటి జరీనా గుర్తొచ్చి, ఆమాటే సూర్యనారాయణతో అన్నాను... అంతే! అప్పట్నుంచీ కాలేజీలో ఆమె



నేను ఆడవాళ్లంటే దూరంగా వుండేవాణ్ణి చిన్నప్పట్నుంచీ. ఆమెతో ఎలా మాట్లాడాలి? ఎలా నా అభిప్రాయం చెప్పాలి? ఎప్పుడూ ఫాషనబుల్ డ్రెస్సులు వేసుకొచ్చే ఆమెకూ- పేదవాడినైన నాకూ పొసుగుతుందా? ఇవన్నీ ఆలోచించి ఆమెపట్ల నా అభిప్రాయాన్ని పదిలంగా గుండెల్లో దాచుకుని వుండిపోయాను.

పేరు జరీనాగా స్థిరపడి పోయింది. ఈ ప్రచార పర్వం నిర్వహించింది సూర్యనారాయణ అని వేరే చెప్పనక్కర లేదు కదా!

ఉషారాణిని అంటిపెట్టుకుని ఝాన్సీ తిరుగుతూండేది. కాలేజీకి రావడం, వెళ్లడం ఎప్పుడూ జంటగానే! అమాయకమైన ముఖం, ఉంగరాల జుట్టు, చక్కని పర్సనాలిటీ, ఆకర్షణీయమైన రూపం... ఝాన్సీని చూడగానే నాలో ఏదో చెప్పలేని అలజడి కలిగింది. త్వరలోనే ఆ అలజడి కాస్తా ఆమె నా జీవిత భాగస్వామి అయితే ఎంత బాగుంటుంది అనిపించింది.

అయినా ఈ ఆంధ్ర దేశంలో అదంత సులభమా? ప్రేమించానంటే అదో నేరం! పెళ్లిచేసుకుంటానంటే వాడో రౌడీ! అమ్మాయిల్తో మాట్లాడడానికి ప్రయత్నిస్తే జులాయితనం!

అందులోనూ నేను ఆడవాళ్లంటే దూరంగా వుండే వాణ్ణి చిన్నప్పట్నుంచీ. ఆమెతో ఎలా మాట్లాడాలి? ఎలా నా అభిప్రాయం చెప్పాలి? ఎప్పుడూ ఫాషనబుల్ డ్రెస్సులు వేసుకొచ్చే ఆమెకూ- పేదవాడినైన నాకూ పొసుగుతుందా? ఇవన్నీ ఆలోచించి ఆమెపట్ల నా అభిప్రాయాన్ని పదిలంగా గుండెల్లో దాచుకుని వుండిపోయాను.

ఎప్పుడూ కబుర్లు చెబుతూ నలుగుర్నీ చుట్టూ తిప్పుకునే సూర్యనారాయణ సాహచర్యం నాలోని విచక్షణా జ్ఞానాన్ని, సహజ స్వభావాన్ని హరింపజేసింది. చాలా కాలానిగ్గానీ ఈ విషయం గ్రహించలేకపోయాను!

ఇంతలో ఓ సంఘటన జరిగింది. దాదాపు ట్రైనీలందరం కలిసి ఆంధ్రా పేపర్ మిల్లుకి ఎక్స్‌కర్షన్‌కి వెళ్లాం. దాదాపు రోజులో చాలా భాగం మిల్లులో సరదాగా అక్కడి వివిధ విభాగాల్ని పరిశీలిస్తూ గడిపాం. అప్పుడే ఝాన్సీతో నాలుగైదుసార్లు దగ్గర దగ్గరగా మెలిగే సందర్భం కలిగింది. అయినా నాలోని ఆత్మన్యూనతా భావం నన్ను మూగవాణ్ణి చేసింది. ఆమె మాత్రం మామూలుగానే నాతో మాట్లాడింది. నేను మాత్రం అంటీముట్టనట్లు సమాధానం చెప్పి తప్పుకున్నాను.

ఆ రోజులు గడిచి అప్పుడే నాలుగేళ్లయ్యాయి. ఈలోగా నా జీవితంలో ఎన్నో మార్పులు! నాలుగేళ్లుగా ప్రభుత్వం టీచర్ పోస్టులకు రిక్రూట్‌మెంట్ నిర్వహించక పోవడంవల్ల ఉద్యోగం ఎండమావి అయ్యింది. ఖాళీగా కూర్చుని నాన్న రెక్కల కష్టంమీద బతకలేక దూరంగా ఓ పల్లెటూళ్లో ఓ ప్రైవేట్ స్కూల్లో రెండొందలకు పాఠాలు చెప్పుకుంటూ రోజులు దొర్లిస్తున్నాను. నాకొచ్చే జీతంరాళ్లు స్వంతంగా వండుకు తింటున్నా చాలవు. ఇలాంటి ఇంటర్వ్యూలకు వెళ్లాలంటే మళ్లీ నాన్నపై ఆధారపడాల్సిన స్థితికి సిగ్గు కలుగుతున్నా ఏంచేయలేకపోతున్నాను. రాసే అలవాటుండటంవల్ల ఖాళీ సమయాన్ని అందుకే పూర్తిగా వినియోగిస్తున్నా, కథారచయితగా కొంతపేరయితే వచ్చింది గానీ, వాళ్లిచ్చే రెమ్యూనరేషన్ పోస్టేజీకే చాలడం లేదు. అయితే నేనూ ఒక రచయితను అన్న ఆత్మసంతృప్తి మాత్రం కలిగించుకోగలిగాను.

* * *

గత స్మృతుల్నుంచి వాస్తవంలోకి వచ్చాను. తీరా తలెత్తిచూసేసరికి జిల్లా పరిషత్తు ఆఫీసు గేటుదాటి మెయిన్ రోడ్డు మీద కూడా చాలా దూరం వచ్చాం. ఇంత దూరం ఎలా నడిచానో గుర్తులేదు. శాస్త్రి ఏదో చెబుతూ, జోకులేస్తూనే వున్నాడు. తన పౌరోహిత్య వ్యవహారాల్లోని తమాషాలు వివరిస్తూనే వున్నాడు. నేను ఊ, ఆ అంటూ పక్కన నడుస్తూనే ఉన్నాను. అయితే తెలివి తెచ్చుకుని చూసేసరికి ముందున్న ఉషారాణీ, ఝాన్సీలు కళ్ల ఎదట్నుంచి ఎప్పుడు తప్పుకుపోయారో తెలియలేదు. మేం మాత్రం ఓవర్ బ్రిడ్జ్ దాటి వచ్చేశాం.

టైం పదవుతూండేసరికి తిరిగి వెనక్కు వచ్చి పరిషత్తు ఆవరణలోకి వచ్చాం. గేటుదాటామో లేదో తిరనాళ్లలా వున్నారు జనం! గుంపుగుంపులుగా. చెట్లకింద, షామియానాల కింద, వరండాల్లో... ఎక్కడ పడితే అక్కడ నేల ఈనినట్లు. ఈ సందట్లో శాస్త్రి నాపక్కనుంచి అదృశ్యమయ్యాడు.

మండువేసవి అవ్వడంవల్ల పదింటికే ఎండ మలమల మాడిపోతోంది. నేనూ ఓ వరండాలో చోటు సంపాదించుకుని కూలబడ్డాను. పక్కగా కూర్చున్న ఓ గుంపు పుస్తకాలు తీసి గడగడా చదువుతున్నారు. మరోపక్క ప్రశ్నోత్తరాల కార్యక్రమం! ఓ చెట్టుకింద చేరిన ఉద్యోగార్థుల తల్లిదండ్రులు పెళ్లిసంబంధాలు వాకబు చేస్తున్నారు. నేను కథకుణ్ణవ్వడంవల్ల ఇలాంటి విషయాలు సహజంగా ఆసక్తికరంగా ఉంటాయి. నా అంచనాకి తగ్గట్టే ఆ గుంపులో శాస్త్రి కనిపించాడు. వీడెంత ఎదిగిపోయాడు! మనసులోనే ఆశ్చర్యపోయాను.

పదిన్నర దాటాక తీరుబడిగా వచ్చిన గుమాస్తాలు షామియానాలలోని టేబుళ్ల దగ్గర కూర్చుని సర్టిఫికెట్ల వెరిఫికేషన్ మొదలుపెట్టారు.

నా వెరిఫికేషన్ లిస్టులో మొదట్లోనే వుండటంవల్ల

త్వరగానే అయిపోయింది. కడుపులో కరకరమంటోంది. ఇంతలో ఎవరో అంటున్నారు కలెక్టర్ కాంప్ నించి వస్తేగానీ ఇంటర్వ్యూలు స్టార్టు కావట. ఆయన ఎప్పుడొస్తాడో, ఇంటర్వ్యూ ఎప్పుడు మొదలవుతుందో తెలియదు.

నా నెంబరు చివర్లో ఉంది గనుక భోజనానికి ధైర్యంగా బయలుదేరాను. నేను తిరిగి వచ్చేసరికే ఇంటర్వ్యూలు స్టార్టయ్యాయి. కొందరు తమ వంతు ముగించుకుని వస్తున్నారు. అంతా తూతుమంత్రంగా సాగుతోంది ఇంటర్వ్యూ ప్రహసనం. అందులోని గుట్టు దాదాపు అందరికీ తెలిసిపోయింది. ఎవరికివాళ్లు ఆశల్ని చంపుకుని, ఉద్యోగాల్ని అమ్ముకున్న పెద్దమనుషుల్ని తిట్టుకుంటూ బయటకు నడుస్తున్నారు.

398 నెంబర్లో ఉన్న నాకు కూడా ఇంటర్వ్యూ సాయంకాలం 6 గం.లకే అయిపోయింది. బోర్డు రెండు గ్రూపులుగా విడిపోయి ఏవో నాలుగు ప్రశ్నలువేసి పంపించేస్తున్నారు. నా తర్వాత 10వ నెంబరు శాస్త్రిది. అతనికోసం ఎదురుచూస్తూ బయట చెట్టు కింద నిలబడ్డాను. తనొచ్చేదాకా వుండమని మరీమరీ చెప్పాడు శాస్త్రి. ఏదో అర్జంటు పని వుందట. ఏమిటో అది?

అయిదు నిమిషాలు అలా నిలబడ్డానో లేదో శాస్త్రి వచ్చేశాడు. ఇద్దరం కలిసి గేటుదాటి బయటికొచ్చాక అడిగాను "ఏంటి సంగతి?" అని.

"ఏం లేదురా. నీ రొట్టె విరిగి నేతిలో పడిందనుకో!" అన్నాడు ఒక్కసారిగా శాస్త్రి.

"ఏమిటా రొట్టె?" అడిగాను మామూలుగా, వాడి హాస్య ధోరణి తెలిసిందే అవడంవల్ల.

"ఇంకా ఏంటంటావేంటి నెమ్మదిగా? నీవు ఝాన్సీ అంటే పడిచచ్చేవాడివి గదా! ట్రైనింగ్ రోజుల్లో ధైర్యంచెయ్యలేక పోయావ్. ఒకవేళ నీవు ధైర్యం చేసినా అప్పుడు కుదిరేది కాదేమో కూడా! ఎందుకంటే వాళ్లు బాగా కలిగిన కుటుంబం. అయితే వ్యాపారంలో నష్టాలు వచ్చి వాళ్ల ఆస్తంతా ఇప్పుడు కరిగిపోయింది. పెద్ద పెద్ద సంబంధాలకోసం చూస్తూ, వచ్చిన సంబంధాలనల్లా తిరగ్గొట్టారప్పుడు. మధ్యాహ్నం పెళ్లిసంబంధాల మాటలు నీవు వినే వుంటావు. వాళ్లలో ఆమె ఫాదర్ కూడా వున్నాడు. రాజమండ్రిలో చదువుకుంటున్నప్పుడే ఆయనతో నాకు కొద్దిగా పరిచయం వుంది. అందువల్ల ఆయన నాతో కూడా ఏదన్నా సంబంధం వుంటే చూడమని చెప్పాడు. వాళ్లదీ మీకేస్టే. శాఖల గురించి నాకు బాగా తెలియదు" అన్నాడు శాస్త్రి.

"పెళ్ళిళ్ల పేరయ్యవి కూడా అయినట్లున్నావే ఈమధ్య?" అన్నాను ఎగతాళిగా శాస్త్రిని.

"అది కూడా మా వృత్తిలో ఓ భాగమనుకో!" తేలిగ్గా అన్నాడు శాస్త్రి." ఇంతకీ నువ్వు 'ఊ'అంటే వెంటనే ఆయనతో మాట్లాడతా!" అన్నాడు తిరిగి.


"... ... ..."

"ఏంటి జవాబు చెప్పవు? ప్రేమ వేరు, పెళ్లివేరు అంటావా?"

"... ... ..."

"ఏంటోయ్ నీ అభ్యంతరం? నీ అభిప్రాయం మారిపోయిందా, లేక వేరే సంబంధం గాని వుందా?" సూటిగా నా కళ్లల్లోకి చూస్తూ అన్నాడు శాస్త్రి.

"నా అభిప్రాయం ఏమీమారలేదు" తడబడ్డాను. గొంతు సవరించుకుని తిరిగి అన్నాను" వేరే సంబంధం కూడా కుదర లేదు. నువ్వన్నట్లు అప్పుడామెను ఇష్టపడ్డ మాట నిజమే. అయితే అందని ద్రాక్ష పండుగా భావించి ఆమెను ఇష్టపడ్డ విషయాన్నే మర్చిపోయాను. నువ్వి



ప్పుడా ద్రాక్ష అందుతుందంటున్నావు. నువ్వు పెళ్లిళ్లపేరయ్యావు కూడా గనుక అన్నీ అందేవేనని ఊరించడం సహజం. మాలో శాఖల పట్టింపులు ఎక్కువ. నాకు ఆ పట్టింపులేకపోయినా వాళ్లకు కూడా ఉండవని లేదు. ఆ సంగతలా వుంచు. ప్రస్తుతం నేను నిరుద్యోగిని. ఆమెకిప్పుడు ఆస్తి లేకపోయినా ఇంగువ కట్టిన గుడ్డ. నేను ఆ ఇంగువ వాసన కూడా లేని వాణ్ణి. స్టూడెంట్ లైఫ్ ఓ కలలు కనే వయసు. కలలు వేరు, వాస్తవం వేరు. కలలన్నీ నిజమవుతాయా? అయితే మంచిదే. కానీ ఎక్కువ భాగం కావు. నాకు ఎప్పటికి ఉద్యోగం వస్తుందో తెలియదు. వచ్చాక, ఆమెకింకా అప్పటికి పెళ్లికాకుండా వుంటే తప్పక నీ సహాయం తీసుకుంటాను. అంతకన్నా నాకు కావలసిందేమీ లేదు." ఒక్కో వాక్యాన్ని కూడబలుక్కుంటూ అన్నాను.

ఎండ పగలు ఏడిపించినా, చీకటి పడిందగ్గర్నుంచీ చల్లగాలి రివ్వున వీస్తూ ప్రాణాల్ని సేద దీరుస్తోంది.

శాస్త్రి నా భుజంమీద చెయ్యి వేశాడు. నాలుగడుగులు నాతోపాటు నడిచి అన్నాడు "నువ్వు ఏదో ప్రైవేటు స్కూల్లో చేస్తున్నావు. ఝాన్సీ కూడా ఎక్కడో పనిచేస్తోంది. ఇద్దరూ ఓచోట పనిచేస్తూ సంసారాన్ని సాగించవచ్చు కదా. ఏమంటావు?" నచ్చజెబుతున్నట్లు అన్నాడు.

భుజం మీద వాడి చెయ్యి తీసి అన్నాను "పౌరోహిత్యం లాంటిదనుకున్నావా శాస్త్రి ప్రైవేటు స్కూలు ఉద్యోగమంటే? ఎప్పుడు పీకేస్తారో తెలియదు. నాకొచ్చేది చాలక, ఇంటి దగ్గిర మా నాన్న మిరాశీ పనిచేస్తాడు గనుక, అక్కణ్ణుంచి బియ్యం తెచ్చుకుని కాలక్షేపం చేస్తున్నాను. అదే సంసారమయితే ఎన్ని ఖర్చులుంటాయో నీకు తెలియక పోలేదు". శాస్త్రికి అంతకు ముందే పెళ్లియ్యింది. ఆ సంగతి వాడికి గుర్తుచేస్తూ అన్నాను.

ఏమనుకున్నాడో గానీ శాస్త్రి, ఇంకేమీ మాట్లాడలేదు. ముభావంగా బస్ స్టేషన్‌కు నడిచాం. నేను విజయవాడ వైపు వెళ్లే బస్సు ఎక్కాను రడీగా ప్లాట్ ఫారంలో ఆగి వుడటంవల్ల. వాడిది ఆ టౌన్‌కు దగ్గర్లోనే ఊరు. వేరే బస్ ఎక్కాలి.

బస్ వేగంగా పరుగులు తీస్తోంది. అంతకన్నా వేగంగా నా ఆలోచనలు నా మనసును గందరగోళం చేస్తున్నాయి.

ఏం చెప్పాను నేను శాస్త్రికి? ఎందుకలా చెప్పాను? ఊహాలోకంలో విహరించే సుందరి నాదయ్యే అదృష్టాన్ని ఎందుకు కాలదన్నుకున్నాను? అసలు ఎలా అలా శాస్త్రికి చెప్పగలిగాను? ఎందుకిలా జరిగింది? ఏమో? ఇదంతా నాకు తెలియకుండానే జరిగిపోయిందన్నట్లుగా అనిపించింది.

* * *

ఇదంతా జరిగిపోయి అప్పుడే పాతికేళ్లు అయిపోయింది. జరిగిపోయిన సంఘటన తలుచుకుంటే ఇప్పటికే మనసంతా శూన్యం నిండిపోతుంది. ఎందుకలా చేశాను? ఇంటి తలుపుతట్టిన అదృష్టాన్ని ఎందుకలా కాలతన్నుకున్నాను? ఇప్పటికీ ఈ ప్రశ్నలకు సమాధానం లభించలేదు. ఏంటో అప్పుడలా జరిగిపోయింది.

మా జడ్.పి.లోనే ఉద్యోగం సంపాదించాను. ప్రైవేట్‌గా ఎం.ఏ. చేసి ఇప్పుడు కాలేజీలో లెక్చరర్‌గా చేస్తున్నాను. ఇద్దరు పిల్లల్లో పెద్దబ్బాయి వైజాగ్‌లో రీసెర్చి చేస్తున్నాడు. తన క్లాస్‌మేట్‌నే ప్రేమించాడు. ఈ విషయం వాళ్లమ్మ చెబితే వాణ్ణి అభినందించాను. నేను చేయలేని పనివాడు చేస్తున్నందుకు మనసారా సంతోషించాను. అయినా ఇప్పటికీ నా మనసులో ఓ సందేహం పట్టిపీడిస్తూనే వుంది. అదే - ఆరోజు శాస్త్రి ప్రపోజ్ చేసినప్పుడు ఎగిరి గంతెయ్యాల్సిందిపోయి, ఎందుకు సందేహించి ఝాన్సీని ఒదులుకున్నాను? ఎంత తరిచి ఆలోచించినా ఇది అర్థంకాని విషయం.

ఇందుకు నాలోని రచయిత రెండు కారణాలుండవచ్చుని చెప్పాడు. ఒకటి. ఆమెను నీవు కలల రాణిగా ఆరాధించావు. వాస్తవ జీవితంలో నీకామె సేవలుచేస్తూ ఓ సామాన్య గృహిణిలా పడివుండాన్ని ఊహించలేకపోయావు. రెండు. అందరానిది ఎప్పుడూ అందంగా వుంటుంది. అందుబాటులోనికి వస్తే మామూలుగా వుంటుంది. ఆమె నీకు అందుబాటులోనికి వచ్చిందని విన్నప్పుడు ఓ మామూలు స్త్రీగా కనబడి వుంటుంది. ఈ రెండు కారణాలలో ఏది నిజం? లేక రెండూ అబద్ధమేనా? ఏమో? మీరే చెప్పండి. ఈ రెండూకాక, ఇంకా నాలో ఆనాటి ఆత్మన్యూనతాభావం అలాగే నిలిచి వుందా? ఆలోచించాలి?

★